కథ

# ఈ మనుషులు ఇక ఇంతేనా?

- విన్నకోట సుశీలాదేవి

నిరుపమ మళ్లీ పెళ్లి చేసుకుంది!

శారద చెప్పిన ఈ వార్త విని స్టాఫంతా ఆశ్చర్య పోయారు. నిరుపమ కాన్వెంటులో టీచరుగా చేరి అయిదేళ్ల యింది. ఆమె తన భర్తనుండి విడాకులు తీసుకుని ఆరేళ్ళయింది. నిరుపమకి కాన్వెంటులో టీచరుగా మంచి పేరు వుంది! ఆమె స్కూల్లో ఎవ్వరితోనూ కలిసేది కాదు తన పని తాను చూసుకునేది. క్రమశిక్షణకు మారుపేరుగా వున్న నిరుపమంటే పిల్లలకి ఎంతో అభిమానం.

స్కూల్లో ఆమెతో కొద్దిగా స్నేహంగా వుండేది శారద ఒక్కతే. అందుకే శారద చెప్పిన వార్త విని అందరూ ఆమెని ప్రశ్నలతో ముంచెత్తారు.

"పెళ్లికొడుకు ఎవరు? ఏం చేస్తున్నాడు? అతడికిదెన్నో పెళ్లి?"

శారద వుక్కిరిబిక్కిరవుతూ- "ఆగండాగండి... ఇక వివరాలేమీ తెలీవు... నిరుపమ వచ్చాక ఆమెనే అడగండి" అంది.

"పెళ్లయ్యాక... ఇంకీ వుద్యోగం చేస్తుందో? లేదో? అసలిక కనబడదేమో. వివరాలెలా తెలుస్తాయి?" అంటూ బాధపడిపోయారు.

వాళ్ల బాధ చూస్తోంటే శారదకి కోపం వచ్చింది.

మనిషి బాహ్యంగా ఎంత అభివృద్ధి చెందినా మనస్సులో ఆలోచనల్లో ఏమార్పూ రాలేదు. అందుకే ఎవరైనా తెగించి ముందుకు అడుగు వేస్తే సంఘం ఆశ్చర్యంతో వుక్కిరి బిక్కిరవుతుంది. అందులోనూ నిరుపమలాటి సాత్వికురాలు మళ్లా పెళ్లి చేసుకుందంటే పెద్ద ఉపద్రవమే ముంచుకొచ్చి నట్లుంది వీళ్లకు అనుకుంటూ శారద క్లాసుకెళ్లిపోయింది. కాని మిగతా స్టాఫు ఆ రూములోనే కూర్చుని - చాలాసేపు నిరుపమ గురించే మాట్లాడుకున్నారు. ఆ రోజు ఎవరికీ పాఠాలు చెప్పాలన్పించలేదు. నిరుపమ ఎప్పుడు స్కూలుకు వస్తుందా, ఆమె నుండి వివరాలు ఎప్పుడు తెలుసు కుందామా అని ఆమెరాకకోసం ఆత్రంగా ఎదురు చూడ సాగారు.

పదిహేను రోజుల తర్వాత -

❖ ❖ ❖

నిరుపమ వచ్చి స్కూల్లో చేరింది. ఆరోజు నిరుపమ కొత్తపెళ్లి కూతుర్లానే మెరిసిపోయింది. రోజూ- బిగించివేసిన జడతో - సాదా చీరతో - శరీరం మీద ఎటువంటి నగలూ లేకుండా సాదా- సీదాగా వచ్చే నిరుపమ - ఈ రోజు సిల్కు చీరతో - మెడలో నల్లపూసల్తో అందానికి ప్రతీకగా వుంది.

ఎప్పుడూ తీరని వ్యథతో క్రుంగిపోతున్నట్లు - తల వాల్చుకుని - బాధగా - భయంగా వుండే నిరుపమ ఈ రోజు ప్రపంచాన్ని జయించిన వనితలా - చిరునవ్వుతో ప్రత్యక్షం కావడం కొందరిలో అసూయ కలిగించింది.

అనాదిగా అసూయ స్త్రీ సహజలక్షణం కదా.

రామాయణంలో సీత అందం శూర్పణఖలో అసూయ కలిగించి - అది తర్వాతి కథకు కారణమైంది!

భారతంలో ద్రౌపది అందం - కౌరవపత్నులలో అసూయ రేపి ఆ తర్వాత వారి భర్తలచే ద్రౌపదీ పరాభవం చేయించింది. కురుక్షేత్ర యుద్ధానికి కారణమైంది.

ఈ రోజు నిరుపమ అందం - ఆనందం మరో యుద్ధా నికి దారితీశాయి.

"నిరుపమ చిరునవ్వు నవ్వి -" నేను పెళ్లి చేసుకున్నాను. అనుకోకుండా జరిగిపోయింది. మిమ్మల్నెవర్నీ పిలవ లేకపోయాను" అంది! ఆమె అలా సూటిగా చెప్తుందనుకోలేదు. అందరూ క్షణ కాలం నిరుత్తరులయ్యారు.

"మీ వారు ఏం చేస్తారు?"

"బిజినెస్ చేస్తున్నారు!"

"మీరు వుద్యోగం మానేస్తారా?"

"వుహు... వుద్యోగం చెయ్యాలనే అనుకుంటు న్నాను. పిల్లలకు పాఠం చెప్పడంలో ఎంతో ఆనంద ముంది. నేను దానిని వదులుకోలేను." అంది నిరుపమ.

"ఆయన అభ్యంతరం చెప్తే.."

"లేదు నా ఇష్టాన్ని కాదనరు!"

"ఆయన్ని మాకెప్పుడు పరిచయం చేస్తారో?"

"వచ్చే ఆదివారం పార్టీ ఎరేంజ్ చేస్తున్నాను.. అందరూ రావాలి." అంది నిరుపమ.

❖ ❖ ❖

వీరే.. నా భర్త కిరణ్‌కుమార్.. వీరంతా మా స్కూలు టీచర్లు..." అంటూ నిరుపమ వారందర్నీ భర్తకు పేరుపేరునా పరిచయం చేసింది. ఫుల్ సూట్‌లో పచ్చగా- పొడవుగా వున్న కిరణ్‌కుమార్‌ని ఆశ్చర్యంగా చూశారు! నిరుపమ మళ్లీ పెళ్లి చేసుకుందంటే ఏ అష్టావక్రుడినో- ముసలివాడినో అనుకున్నారు!. ఆ వ్యక్తిని చూసి నవ్వుకోవాలని - అపహాస్యం చేయాలని వచ్చిన వాళ్ళు కిరణ్‌ని చూసి అవాక్కయ్యారు!.

అందరి హృదయాలు అసూయతో దహించుకు పోయాయి. ఇంత వరకూ తమకంటే ఎంతో తక్కు వలో వున్న నిరుపమ ఒక్కసారి హిమాలయ మంత ఎత్తు పెరగడం కొందరికి భరింపరానిదయింది. వీరి బాధ మరొక కొత్తగాథకు నాంది అయింది!.

పార్టీ జరిగిన నెల రోజుల తర్వాత - ఒకరోజు నిరుపమ ఉబ్బిపోయిన ముఖంతో ఎర్రబడ్డ కళ్లతో స్కూలుకు వచ్చింది. పెళ్లి చేసుకున్నాక నిరుపమని ఈ స్థితిలో చూడడం ఇదే ప్రథమం.

"ఏమిటి? అలావున్నావ్?" అంటూ చుట్టూ మూగారు. "ఏంలేదు." అంటూ కళ్లు తుడుచుకుంది!. కానీ నిరుపమ ఇలా కన్నీరు పెట్టుకుందంటే దానికి చాలా బలమైన కారణమే వుంటుంది. అదేమిటో తెలుసుకోవాలనే ఆరాటం వారిలో క్షణక్షణానికి ఎక్కువ కాసాగింది!.

"నిరుపమా! నీలో నువ్విలా బాధపడితే ఎలా? నీకొచ్చిన బాధేమిటో చెప్పు." అంటూ బలవంతం చేశారు.

"ఏం చెప్పను! నేను మోసపోయాను!" అంటూ చేతుల్లో ముఖం దాచుకుంది. "అంటే"


"ఇంత కంటే ఏం చెప్పలేను. నన్నడక్కండి" అంది వెక్కివెక్కి ఏడుస్తూ ఆ మాటతో వాళ్లకంతా అర్థమైంది! ఆ రోజంతా ఆమెని ఓదారుస్తూనే వున్నారు. పాపం. ఎంతో ఆశపడి పెళ్లి చేసుకుంది. కాని అతడొట్టి శాడిస్టు అయివుంటాడు. జీవితంలో రెండోసారి ఓడిపోయింది.

ఆ రోజంతా అందరి ఆలోచనల్లోనూ నిరుపమే. ఆమె పై జాలి.

నిరుపమ పరిస్థితికి శారదకి కూడా జాలికలిగింది! నిరుపమ తన జీవితంలో ఏర్పడిన వెలితిని పూడ్చు కోవాలని - ఒంటరి బ్రతుక్కు తోడు కావాలని ఆలోచించి - ఆశపడి...పెళ్లి చేసుకుంది! కానీ రెండోసారికూడా జీవితంలో గెలవలేకపోయింది.

ఒకప్పుడు భర్త హింసకు తట్టుకోలేక విడాకులు తీసుకుంది. ఇప్పుడు అదే పరిస్థితి వచ్చింది. ఇప్పుడు కూడా విడాకులు తీసుకుంటుందా!" శారద మనస్సు పరిపరి విధాలుగా ఆలోచించ సాగింది.

ఒకసారి ఆమె భర్తని కలిసి నిరుపమ పరిస్థితిని వివరించి - ఆమెని బాధించవద్దని - ఆమెతో సుఖజీవనం సాగించమని సలహా ఇవ్వాలని వుంది. నా అంతట నేను వాళ్లింటికి వెళ్లడం బాగుండదేమో! వాళ్లిద్దరూ ఎక్కడైనా కనబడితే కనీసం... కిరణ్‌కుమార్ అయినా కనబడితే బాగుణ్ణు అనుకుంది శారద. నిరుపమ ఈ మధ్య తరుచూ స్కూల్లో ఏడుస్తోంది. టీచర్లు సాను భూతిని వర్షంలా కురిపిస్తున్నారు.



ఎంతో ప్రేమాభిమానాల్ని చూపిస్తున్నారు. కానీ శారదకి నిరుపమ స్థితి ఎంతో బాధ కలిగిస్తోంది!. ఆమె జీవితం బాగుచేయాలి! ఎలా! ఎలా?...

ఒకరోజు శారద పిల్లలతో బజారు వెళ్లింది. బజారు పని అయ్యాక పిల్లలు గోల పెడితే హెూటల్‌కు తీసు కెళ్లింది. ఖాళీగా వున్న టేబిల్ దగ్గర కూర్చుంటూ ..

చుట్టూ చూసింది.. హెూటల్లో ఒక మూలగా.. నిరుపమ - కిరణ్ కనబడ్డారు! ఇద్దరూ ఒకళ్లకెదురుగా ఒకరు కూర్చున్నారు. నిరుపమ సన్నంచు నీలం పట్టుచీర కట్టుకుని మెడలో ముత్యాలు వేసుకుంది! జడలో మల్లెదండలు. ఎంతో అందంగా తయారైంది. కిరణ్ కూడా అమెకు తగ్గట్టుగానే వున్నాడు. ఇద్దరూ పరిసరాల్ని గమనించకుండా కబుర్లు చెప్పుకుంటున్నారు.

వారిని చూస్తోంటే శారదకి చాలా ఆశ్చర్యం కలుగుతోంది. ఈ వ్యక్తి గురించేనా నిరుపమ ఇంత చెడ్డగా చెప్పింది? తనని ఎక్కడికీ తీసుకెళ్లడని - మాటల్తో - చేతల్తో హింసిస్తాడని ఎన్నో చెప్పిందే?

కానీ ఇప్పుడెంత ఆనందంగా వున్నారు.... పిల్లల్ని అక్కడే కూర్చోమని- తను వాళ్ల దగ్గరకు వెళ్లింది.

"నిరుపమా"

వాళ్లిద్దరూ వులిక్కిపడి తలెత్తారు!

"అరె..నువ్వా శారదా రా కూర్చో. మా శారదండీ," అంటూ పరిచయం చేయబోయింది.

"తెలుసు.. నీ కోలీగ్.. నీ ఫ్రెండు. ఏవండీ బాగున్నారా? ఒక్కసారీ మా ఇంటికి రాలేదు?" అన్నాడు కిరణ్.

కిరణ్ ఇంకా ఏవేవో మాటాడుతున్నాడు.. శారద అవేమీ వినిపించుకోవడం లేదు.. ఆనందంతో వెలిగి పోతున్న నిరుపమ ముఖాన్ని చూస్తూ...

"నీరూ ఒక్క ప్రశ్న అడగనా?" అంది.. తన ఆరాటాన్ని అణచుకోలేక. ఆమాటకు నిరుపమ నవ్వి...

"నాకు తెలుసు!. ఆ ప్రశ్న శారదా! నేను రోజూ మా వారి గురించి చెప్తున్న వన్నీ అబద్ధాలే... దానికి కారణం..."

క్షణం ఆగి,

"శారదా! సాటి మనిషి బాధపడుతుంటే సానుభూతి - జాలి కురిపించడానికి పోటీ పడతారు! కాని ఆ మనిషి - సంతోషంగా- ఆనందంగా వుంటే మాత్రం సహించలేరు. అందుకే ఈ నాటకం" అంది.

"నాటకమా!"

"అవునండీ మా ఇద్దరికీ బొత్తిగా పడడంలేదనీ - నేను నిరుపమని హింసిస్తుంటానని స్కూల్లో చెప్ప మన్నాను." అన్నాడు కిరణ్ కల్పించుకుని.

"ఎందు కలా?"

అతడు కుర్చీ వెనక్కి జారగిలబడి చెప్పసాగాడు! "మాకు పెళ్లయిన కొత్తలో అంటే... మా పెళ్లి పార్టీ ఇచ్చాక నాకు నిరుపమ గురించి రెండు అకాశరామన్న ఉత్తరాలొచ్చాయి. రెండింటిలోనూ సారాంశం ఇంచుమించు ఒక్కటే... నిరుపమ ప్రవర్తన మంచిది కాదని, ఆమె మొదటి భర్త అందుకే ఆమెని వదిలేశాడని.... ఇలా ఎన్నెన్నో నిందలు వేస్తూ ఆ వుత్తరాలు రాశారు... ఎవరు వ్రాసి వుంటారో నేను కొంతవరకు వూహించ గలిగాను. అందుకే నిరుపమని స్కూల్లో అలా నటించ మన్నాను. చిత్రంగా అప్పటినుండీ నాకు వుత్తరాలు రాలేదు తగ్గిపోయాయి తెలుసా."

"మీరు పొరబడుతున్నారేమో!"

"లేదండీ. శారదగారూ. నేను బాగా అనుభవం మీదే చెప్తున్నాను. నిరుపమని నేను ప్రేమించి పెళ్లిచేసు కున్నాను. వాళ్లు వూహించినట్లుగా కాక నేను మొదటి పెళ్లి వాడిని కావడం, ఇంకా వాళ్లు అనుకున్న విధంగా లేకపోవడం.. మేము ఏ భేదాభిప్రాయాలు లేకుండా హాయిగా సంసారం చెయ్యడం కొందరికి ఇష్టం లేకపోయింది. అందుకే అటువంటి వుత్తరాలు వచ్చాయి. నేను సకాలంలో మేలుకోకపోతే ఇంకెంత అనర్థం జరిగేదో. ఇప్పుడిక మా సంసారం వేపు ఎవ్వరూ కన్నెత్తి చూడరు"... అంటూ నవ్వాడు.

శారద కిదంతా అంతులేని ఆశ్చర్యాన్ని కల్గించ సాగింది. మనుషులు ఎందుకిలా వుంటారు. ప్రక్కవాడు తన కంటే వున్నతుడైతే సహించలేరు... సంతోషంగా వుంటే ఓర్వలేరు. ప్రతిక్షణం ఎదుటి వాళ్లగురించి ఆలోచిస్తూ- శపిస్తూ వుంటారు. వాళ్లలో లేని లక్షణాలను కల్పించి అపకీర్తి పాలు చేయడం- వాళ్ళు ఏడుస్తోంటే బాగా శాస్తి జరిగిందని నవ్వుకోడం ఇదే మనిషి స్వభావం. - ఇది మారేదెన్నడో!

"ఏమిటి శారదా ఆలోచిస్తున్నావు" అనడిగింది నిరుపమ. "ఏంలేదు. మీ వారి తెలివితేటల్ని మెచ్చు కుంటున్నా! "అంది శారద.

"తెలివితేటలు కాదు.. ముందు చూపు అనండి... మరి నా సంసారాన్ని నేను నిలబెట్టుకోవాలి కదా! నిరుపమలాటి అపురూప వ్యక్తిని ఎలా వదులుకుంటాను..." అన్నాడు నిరుపమ వేపు నవ్వుతూ చూస్తూ. నిరుపమ సిగ్గుపడింది.

"నిరుపమ చాలా అదృష్ట వంతురాలు" మనస్ఫూర్తిగా అభినందించింది శారద.